క్లుప్తంగా

కనకదుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

గండేపల్లి: మండలంలోని మురారి మామిడి తోటల్లో వేంచేసిన కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా పలు వాహనాల్లో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భోజనాలు చేశారు. సాయంత్రం వరకూ ఆటపాటలతో చెట్ల కింద ఆనందంగా గడిపారు. .

జగనన్న విద్యా కానుక పంపిణీకి సర్వం సిద్ధం

ప్రత్తిపాడు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టిట్ సారించారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, షూ, బెల్టు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టై తదితర సామగ్రి అందిస్తున్నారు. పాఠశాలల పునః ప్రారంభం రోజున వాటిని విద్యార్థులకు ఇవ్వనున్నారు.

6,838 మందికి..

ప్రత్తిపాడు మండల పరిధిలోని 34 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 9 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 6,838 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ కిట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు.

14 నుంచి లలితా, విష్ణు సహస్రనామ పారాయణలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఈ నెల 14 నుంచి ప్రతిరోజూ సాయంత్రం 4.30 గంటల నుంచి ఆరు గంటల వరకూ విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తబృందాలు ఈ పారాయణలు చేసేందుకు తమ పేర్లను పీఆర్వో కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

కిర్లంపూడి: వీరవరం గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధి వీరవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.10200 స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ సిబ్బంది శివ, సత్యనారాయణ, హోంగార్డు రాంబాబు పాల్గొన్నారు.

యల్లమిల్లిలో మరో ఏడుగురు..

గండేపల్లి: పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని యల్లమిల్లి గ్రామ శివారులో పేకాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17900 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు



గోపాలపట్నంలో చోరీకి యత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తొండంగి: గోపాలపట్నంలోని ఓ ఇంట్లో చోరీకి యత్నించి ఇంటి యజమానులకు చిక్కిన వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే...గోపాలపట్నం ఎస్‌బీఐ బ్యాంకు వీధిలోని ఓ ఇంట్లో చోరీ చేసేందుకు వ్యక్తి ప్రవేశించాడు. దీనిని గమనించిన ఇంటి యజమాని అతడిని పట్టుకుని 112 నంబరుకు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్నవరం హెచ్‌సీ గణేష్, పీసీ అర్జున్ స్పందించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకుని తొండంగి పోలీసు సిబ్బందికి అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. వేసవిలో చోరీలకు అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

గ్రహణం మొర్రికి ఉచిత శస్త్ర చికిత్సలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో గ్రహణం మొర్రి బాలలకు ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ), ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ముత్తూట్ ఫౌండేషన్, కాకినాడ జీజీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో మిషన్ స్మైల్ పేరుతో నిర్వహించనున్న ఈ శస్త్రచికిత్సలు జూలై ఒకటి నుంచి నాలుగవ తేదీ మధ్య నాలుగు రోజుల పాటు జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి పర్యవేక్షణలో ఉచితంగా జరుగుతాయన్నారు. ప్రచార కరపత్రాన్ని డాక్టర్ నరసింహం కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో ఆదివారం విడుదల చేశారు. బాధిత బాలలు వారి తల్లిదండ్రులకు ప్రయాణ ఖర్చులు, ఆహార సదుపాయాలు సంస్థ ఉచితంగా కల్పిస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఉన్నత చదువు.. భవితకు వెలుగు

- ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య
- మెరుగైన ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు
- అందుబాటులో పలు గ్రూపులు
- ఈ ఏడాది నుంచి మారనున్న విద్యావిధానం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం

ఏలేశ్వరం: ఒకప్పుడు ప్రభుత్వ విద్యాసంస్థలంటే చిన్నచూపు. విద్యతో పాటు కనీస వసతులు ఉండేవి కావు. దీంతో ప్రజలు ఆర్థిక భారమైనా పట్టించుకోకుండా కార్పొరేట్ విద్యాసంస్థలను ఆశ్రయించేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేశారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నాణ్యమైన విద్య

ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యతో పాటు పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో 2009లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. ఏలేశ్వరం మండలంతో పాటు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాలు, ఏజెన్సీ మండలాలైన రాజవొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం, గంగవరం పరిధిలోని ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇదే. ప్రస్తుతం కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలో ఉన్న ఈ కళాశాలలో అతి తక్కువ ఫీజులే వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో 367 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నారు.

విద్యావిధానంలో మార్పులు

ప్రస్తుత విద్యా సంవత్సరం (2022–23) నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యావిధానం మారనుంది. గతంలో డిగ్రీ మూడేళ్లు పూర్తి చేస్తే పాసైనట్టు సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఈ ఏడాది నుంచి తొలిసారిగా సింగిల్ మేజర్ ప్రాజెక్టులో భాగంగా డిగ్రీ



ఇంటింటా ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు

మొదటి సంవత్సరం పాసై మానిస్తే సర్టిఫికెట్ ఇస్తారు. రెండో ఏడాది పాసై మానేస్తే డిప్లొమో ఇస్తారు. మూడో ఏడాది పాసై మానిస్తే డిగ్రీ పట్టా ఇస్తారు. నాలుగో ఏడాది పాసై మానిస్తే హనర్స్ డిగ్రీ సర్టిఫికెట్ ఇస్తారు. ఈ ఏడాది నుంచి డిస్కంటిన్యూ అనే పదం ఉండదు. ప్రతి ఏడాదిలోనూ రెండు సెమిస్టర్‌లు పాసైతేనే పైన పేర్కొన్న సర్టిఫికెట్‌లు ఇస్తారు.

అందుబాటులో గ్రూపులు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ గ్రూపులో ఎకనామిక్స్ (మెయిన్), పొలిటికల్ సైన్స్ (మైనర్), బీకాంలో కామర్స్(మెయిన్), కంప్యూటర్ అప్లికేషన్ (మైనర్), బీఎస్సీలో మాథ్స్ (మెయిన్), కంప్యూటర్ సైన్స్ (మైనర్), బీజెడ్‌సీలో బోటనీ(మెయిన్), కెమిస్ట్రీ (మైనర్) గ్రూపులు అందుబాటులో ఉన్నాయి.

ఇంటింటా ప్రచారం

విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో కళాశాలలో గ్రూపులు, వసతులపై అవగాహన కల్పించేందుకు ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. కళాశాలకు సంబంధించి పలు చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

అన్నిగ్రూపులు ఉన్నాయి



ఏలేశ్వరం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. తక్కువ ఫీజులతో అన్ని గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్నిపథకాలు వర్తింపజేస్తాం.

– దొండపాటి సునీత, ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీకళాశాల

31 వాహనాలు సీజ్



తునిలో సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

తుని: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 31 వాహనాలను సీజ్ చేసినట్టు పట్టణ సీఐ నాగదుర్గారావు ఆదివారం తెలిపారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో రాత్రి వేళల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పార్క్ సెంటర్, ఎల్‌ఐసీ బిల్డింగ్ సెంటర్, బాలాజీ రోడ్డు, గొల్లప్పారావు, శ్రీనివాస థియేటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, సీతారాంపురం తదితర సెంటర్లలో గస్తీ నిర్వహించి సరైన పత్రాలు లేని 24 మోటారు సైకిళ్లు, రెండు బొలేరోలు, ఆటోతో పాటు మద్యం తాగి నడుపుతున్న రెండు వాహనాలను సీజ్ చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టామన్నారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతున్న 15 మందిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ సందర్భంగా సీఐ నాగదుర్గారావు మాట్లాడుతూ ఎవరైనా తమ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాన్నారు. నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



తునిలో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఉపాధ్యాయులు



ఏలేశ్వరంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ
- ప్రశంసా పత్రాల అందజేత

ఏలేశ్వరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. లైబ్రేరియన్ కవి కొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో గత నెల 8 నుంచి విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు పలువురు ఉపాధ్యాయులు కథలు, కథనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనంపై శిక్షణ నిచ్చారు. ముగింపు వేడుకల్లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సుంకర రాంబాబు, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని సుమారు 90 మంది విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చెన్నాప్రగడ సత్యగాంధీ, ఇబ్రహీంఖాన్, కడింశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ

తుని: స్థానిక శాఖా గ్రంథాలయంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయని లైబ్రేరియన్ జి.రంగనాథరావు తెలిపారు. ముగింపు వేడుకల్లో విశ్రాంత ఉపాధ్యాయుడు కె.నాగభూషణం, ఉపాధ్యాయుడు జగన్నాథం పాల్గొని శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసా ప్రత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు తప్పుదారి పట్టకుండా విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకునేందుకు వీలుగా గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. పేద విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

82 మంది ఉపాధ్యాయుల బదిలీ

ప్రత్తిపాడు: మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న 82 మంది ఉపాధ్యాయులు ఇతర మండలాలకు బదిలీ అయినట్టు ఎంఈఓ వి.రాజబాబు ఆదివారం తెలిపారు. మండలంలోని 48 పాఠశాలల్లో 210 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. వీరిలో 82 మంది బదిలీ కాగా ఇతర మండలాల నుంచి 79 మంది ఉపాధ్యాయులు ఆదివారం మండలానికి బదిలీపై వచ్చినట్టు ఆయన వివరించారు.

వారం రోజుల పాటు ఒంటి పూట బడులు

వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. కాగా వేసవి ఉష్ణోగ్రతలు మాత్రం ఇంకా తగ్గుముఖం పట్టకపోవడంతో వారం రోజుల పాటు ఒంటి పూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఈ నెల 17వ తేదీ వరకూ ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు ఒంటి పూట బడులు నిర్వహించాలని ఎంఈఓ రాజబాబు ఆదేశించారు.

బీజేపీ మోర్చాల నియామకం చేపట్టాలి

ప్రత్తిపాడు: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బలోపేతానికి వివిధ మోర్చాల కార్యవర్గ సభ్యుల నియామకం చేపట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకట సూర్యనారాయణ పార్టీ నేతలను ఆదేశించారు. ప్రత్తిపాడులోని రాజా కింగుబాబు రాజు స్వగృహంలో ఆదివారం సాయంత్రం బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నాటికి గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, సుపరిపాలన తదితర అంశాలను పార్టీ శ్రేణులకు వివరించారు. మండల బీజేపీ కార్యదర్శి మదినే బాబ్జి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాసరావు, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ పాపారావు, బీజేపీ అనుబంధ సంస్థల నాయకులు పెట్లు కొండబాబు, దాకే కృష్ణారావు, కర్రి ధర్మరాజు, గున్నాబత్తుల రాజబాబు, గట్టెం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో ఉద్రిక్తత

- అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం తొలగింపు
- 144 సెక్షన్ అమలు

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెం ప్రధాన రహదారి చెంత అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని అధికారులు తొలగించారు. గ్రామంలో శనివారం తెల్లవారుజామున ఓ వర్గం సభ్యులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా మరో వర్గం వారు వ్యతిరేకించారు. దీనిపై వివాదం చెలరేగడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామానికి చేరుకుని ఇరువర్గాల వారితో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం తొలగించడానికి ఓ వర్గం ససేమిరా అనడంతో పాటు విగ్రహం వద్ద బైఠాయించారు. ఆదివారం తెల్లవారుజామున భారీ పోలీసు బందోబస్తు నడుమ అధికారులు అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించారు. అడ్డువచ్చిన పలువురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. తొలగించిన అంబేడ్కర్ విగ్రహాన్ని గోకవరం మండల పరిషత్ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనలో సుమారు 16 మందిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ నెల 14 వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. సుమారు 30 మంది పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశారు. అనంతరం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్‌తో పాటు పలువురు గ్రామంలోకి రావడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.



ఎండకు నిర్మానుష్యంగా మారిన తుని-ప్రత్తిపాడు రహదారి

ప్రత్తిపాడు: భానుడు భగ్గుమంటున్నాడు. గత వారం రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రత్తిపాడులో ఆదివారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచే వేడిగాలులు ప్రారంభమయ్యాయి. రాత్రి సమయంలో కూడా వేడిగాలులు వీయడం, ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉదయం పది గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. వడగాడ్పులు వీయడంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాల కోసం ప్రజలు, రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని వినతి

కోటనందూరు: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తన జీవితాన్నే అర్పించిన బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇచ్చేందుకు కృషి చేయాలని స్థానిక మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే కోరారు. ఈ మేరకు రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితను ఆదివారం కొవ్వూరులోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. భారతదేశ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసిన జగ్జీవన్‌రామ్‌కు తగిన గౌరవం దక్కేలా చూడాలన్నారు. మాదిగల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి వనితకు వివరించారు. పలువురు మాదిగ ప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి తానేటి వనితకు వినతిపత్రం అందిస్తున్న ఆరుగుల మోషే

జనసేన సభకు స్థల పరిశీలన

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో ఈ నెల 14న నిర్వహించే జనసేన సభకు ఆదివారం స్థల పరిశీలన చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కందుల దుర్గేష్, పెద్దాపురం డీఎస్పీ లతా కుమారితో కలిసి బస్ స్టేషన్ పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించారు. సభ జరిగేటప్పుడు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని డీఎస్పీ సూచించారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

శంఖవరం: స్థానిక ఆదర్శ పాఠశాలలోని 6వ తరగతిలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 6వ తరగతిలో 100 సీట్లకుగాను 184 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 100 మందికి అర్హత కల్పిస్తామని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 30 మార్కులు, బీసీ, ఓసీ విద్యార్థులకు 35 మార్కులు వస్తే ప్రవేశానికి అర్హులుగా గుర్తిస్తామన్నారు.



శంఖవరం ఆదర్శ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బడి గంటలు మోగే వేళ

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి చర్యలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు



గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్

గోకవరం: విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులు పాఠశాలలకు వచ్చే సమయానికి వారికి అన్ని వసతులు సమకూర్చేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జగనన్న విద్యాకానుక కిట్లను మండలాల వారీగా పంపించి పాఠశాలలు తెరిచిన వెంటనే పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది.

నియోజకవర్గంలో 181 పాఠశాలలు

జగ్గంపేట నియోజకవర్గంలో గోకవరం, జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లో సుమారు 181 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. గోకవరం మండలంలో ఏడు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, 33 ఎంపీపీ, 10 ఎంపీయూపీ పాఠశాలలు ఉండగా మొత్తం 6490 మంది విద్యార్థులు చదువుతున్నారు. జగ్గంపేట మండలంలో ఎనిమిది జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఐదు ఎంపీయూపీ పాఠశాలలు, 34 ఎంపీపీ పాఠశాలలు ఉండగా 7,460 మంది విద్యార్థులు ఉన్నారు. కిర్లంపూడిలో ఎనిమిది జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఐదు ఎంపీయూపీ, 30 ఎంపీపీ పాఠశాలలు ఉండగా 6,265 మంది విద్యార్థులు ఉన్నారు. గండేపల్లి మండలంలో ఆరు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఐదు ఎంపీయూపీ, 30 ఎంపీపీ పాఠశాలలు ఉండగా 4252 మంది విద్యార్థులు చదువుతున్నారు.



విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన పాఠ్యపుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం మనబడి నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పథకం కింద ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూస్, బ్యాగు, యూనిఫాం, సాక్సులు, బెల్టు, డిక్షనరీ అందిస్తున్నారు. జగనన్న అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. జగనన్న గోరుముద్ద పథకం మెనూలో మార్పులు చేశారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారంతో పాటు రాగిజావ అందిస్తున్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తూ బైజూస్ ద్వారా మెరుగైన విద్యను అందిచడంతో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధించారు.



వాహనాల్లో పాఠశాలలకు చేరుకున్న జగనన్న విద్యాకానుక కిట్లు

17 వరకూ ఒంటిపూట బడులు



అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జగనన్న విద్యాకానుక కిట్లు వచ్చాయి. వీటిని పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రస్తుతం వేసవి ఎండలు ఎక్కువగా ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 17 వరకు ఒంటి పూట బడులు నిర్వహిస్తాం. విద్యార్థులు ఉదయం 7.30 గంటలకు పాఠశాలలకు రావాలి.

– బి.గౌరమ్మ, ఎంఈఓ, గోకవరం

బాలుడిపై అలబండ దాడి





అలబండ దాడిలో గాయపడిన సత్యసందీప్, బాలుడికి అయిన తీవ్రగాయాలు

తుని రూరల్: లోవకొత్తూరు గ్రామానికి చెందిన పలివెల సత్యసందీప్ అనే బాలుడిపై అలబండ దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఆదివారం తన తండ్రి అశోక్‌బాబుతో కలసి పొలం నుంచి ఇంటికి వస్తుండగా ఆకస్మికంగా వచ్చిన అలబండ సత్యసందీప్‌పై దాడి చేసింది. గాయపడిన బాలుడు తుని ఏరియా ఆస్పత్రితో చికిత్స పొందాడు. ఆస్పత్రిలో బాలుడికి వైద్యం చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాలుడి తండ్రి అశోక్‌బాబు ఆరోపించారు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...కామరాజుపేట గ్రామానికి చెందిన బలిరెడ్డి వెంకటరమణ (40)ను ఆదివారం తెల్లవారుజామున ఎల్లం చెరువు దగ్గరలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. దీనిపై ఏఎస్ఐ రాంబాబునాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.